www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లాలో ముందస్తు వ్యవసాయ ప్రణాళిక!

- వరి సాగు విస్తీర్ణం 89 వేల నుంచి 29 వేల ఎకరాలకు కుదింపు
- పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు పెంపునకు కార్యాచరణ: కలెక్టర్ అంకిత్



4

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 284 గురువారం 12-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5



అనివార్యమా..?

మారనున్న రాజకీయ పరిణామాలు

తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త నాయకత్వానికి పగ్గాలు

మంత్రి ఇలాకా లో హాట్ హాట్ రాజకీయాలు

జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఎవరిని వరించనుందో...?

ఆసక్తికరంగా పాత అధ్యక్షుని పయనం

మంత్రి అడ్డాలో మరో ఊహగానానికి తెర

ఆ జిల్లాలో అధికార పార్టీకి సంబంధించి అనూహ్యమైన ప్రచారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు ఆ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న కీలక మంత్రి కేంద్ర రాజకీయాల వైపు పయనమవుతున్నారంటూ చర్చలు సాగుతున్న నేపథ్యంలోనే తాజాగా మరో వార్త ప్రచారంలోకి వస్తుంది. తెలంగాణలోని సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సాహిత్యంగా ఉండే మంత్రి మనిషి ప్రస్తుతం ఆ జిల్లాలో డీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నెరవేరుస్తున్న పరిస్థితి. ఇదే సమయంలో ఆ జిల్లాలో త్వరలో జిల్లా పార్టీ అధ్యక్షునిగా కొత్తవారికి అవకాశం కలగబోతోందనేప్రచారం రాజకీయ వర్గాల్లో మారింది. ప్రస్తుతం ఆ జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతల నిర్వర్తిస్తున్న నేతపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దానికి సంబంధించి పత్రికల్లో వరుస కథనాలు వెలువడ్డాయి. అయితే ప్రస్తుతం అదే నాయకుడు స్థానంలో జిల్లాకు మరో కొత్త బాస్ అనివార్యమైన పరిస్థితుల్లో వచ్చే అవకాశం ఉందనే ప్రచారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది..

భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

నిజాయితీ, పారదర్శకతతోనే సంస్థల సమగ్ర అభివృద్ధి

- సింగరేణి అధికారులకు విజిలెన్స్ అవగాహన కార్యక్రమం
- అవినీతి నిర్మూలనకు ప్రతి ఉద్యోగి నైతిక విలువలకు కట్టుబడాలి: కిషోర్ బగాడియా



4

యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండండి!

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు వచ్చే అవకాశం

నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి: వ్యవసాయ అధికారి బాబురావు



3



డిసిసి మార్పు అనివార్యమా..?

- ఆ జిల్లాలో అధికార పార్టీకి కొత్త బాస్
- మారనున్న రాజకీయ పరిణామాలు
- తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త నాయకత్వానికి పగ్గాలు
- మంత్రి ఇలాకా లో హాట్ హాట్ రాజకీయాలు
- జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఎవరిని వరించనుందో...?
- ఆసక్తికరంగా పాత అధ్యక్షుని పయనం
- మంత్రి అడ్డాలో మరో ఊహగానానికి తెర



ఆ జిల్లాలో అధికార పార్టీకి సంబంధించి అనూహ్యమైన ప్రచారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు ఆ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న కీలక మంత్రి కేంద్ర రాజకీయాల వైపు పయనమవుతున్నారంటూ చర్చలు సాగుతున్న నేపథ్యంలోనే తాజాగా మరో వార్త ప్రచారంలోకి వస్తుంది. తెలంగాణలోని సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సాహిత్యంగా ఉండే మంత్రి మనిషి ప్రస్తుతం ఆ జిల్లాలో డీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నెరవేరుస్తున్న పరిస్థితి. ఇదే సమయంలో ఆ జిల్లాలో త్వరలో జిల్లా పార్టీ అధ్యక్షునిగా కొత్తవారికి అవకాశం కలగబోతోందనేప్రచారం రాజకీయ వర్గాల్లో మారింది. ప్రస్తుతం ఆ జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతల నిర్వర్తిస్తున్న నేతపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దానికి సంబంధించి పత్రికల్లో వరుస కథనాలు వెలువడ్డాయి. అయితే ప్రస్తుతం అదే నాయకుడు స్థానంలో జిల్లాకు మరో కొత్త బాస్ అనివార్యమైన పరిస్థితుల్లో వచ్చే అవకాశం ఉందనే ప్రచారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది..

భద్రాద్రి న్యూ స్ స్పెషల్ ఫోకస్

వడ్డించేవాడు మనవాడైతే ఏ వరుసలో ఉన్నా అందాల్సింది అందుతుంది.. అది పరమాన్నమైనా....పదవైనా... సరిగ్గా అలాంటిదే ఓ కీలకమైన మంత్రి ప్రాతినిధ్య వహిస్తున్న జిల్లాలో చోటు చేసుకోబోతోందనే చర్చలు రాజకీయంగా ఆసక్తికరంగా మారుతున్నాయి. తెలంగాణలో అత్యంత కీలకమైన మంత్రిగా ఇటు రాష్ట్ర కేంద్రస్థాయిలో గుర్తింపు పొందిన నేతగా ఉన్న ఆ మంత్రి అనుచరుడు ప్రస్తుతం తాను అనుభవిస్తున్న డీసీసీ అధ్యక్ష పదవికి దూరము కావలసిన పరిస్థితులు నె లకోనబోతున్నాయనే ఊహాగానాలు ఊర్లేగుతున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా కీలకమైన మంత్రి సంబంధిత జిల్లాకు ప్రాధాన్యతతో కూడిన పదవి అలంకరించబోతుందని ఊహగానాల నేపథ్యంలో ఆ వార్త కూడా ప్రచారానికి నోచుకుంది ఇప్పటికే తెలంగాణలో అత్యంత ముఖ్యమైన మినిస్టర్ కేంద్ర రాజకీయాల వైపు వెళ్తున్నారనే వార్త దావాణంలా వ్యాప్తి చెందుతుండగానే అదే మంత్రి మనిషిగా చాలమణి అవుతున్న ఆ జిల్లా డిసిసి అధ్యక్షుడిని రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయి పదవి అలంకరించబోతుందనే చర్చలు సాగుతున్నాయి. ప్రస్తుతం ఆ మంత్రి మనిషి ఆ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చలామణి అవుతున్నారు కాగా నామినేటెడ్ పోస్టుల భర్తీ కార్యక్రమంలో భాగంగా బీసీ అయిన డిసిసి అధ్యక్షునికి కీలకమైన ప్రమోషన్ ఇప్పించే దిశగా మంత్రి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఆ జిల్లాలో సదరు డిసిసి అధ్యక్షులు తీరుపై ఎన్నో ఆరోపణలు వస్తుండగా పత్రికల్లో పలు కథనాలు వెలువడ్డ నేపథ్యంలోనే ఆ నాయకునికి ప్రమోషన్ ఇచ్చే పనిలో మంత్రి ఉన్నారనే.ప్రచారం జోరుగా ఊపాందుకుంటుంది.. ఈ క్రమంలో ఒకవేళ ఎన్ని ఆరోపణలో ఉన్న సాక్షాత్తు తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత కీలకమైన మంత్రి ఆ బీసీ నేతకు ఆత్యంత సనిహిత్యంగా ఉన్న నేపథ్యంలో ఆయనకు ప్రమోషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ ఆయన్ని వరించే అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా మంత్రి కూడా పావులు కదుపుతున్నారని ప్రచారం జోరుగా సాగుతుంది. ఒకవేళ అదే జరిగితే డిసిసి అధ్యక్షుని స్థానంలో కొత్త నాయకత్వానికి పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో సమర్థులు ఎవరినే.విషయంలో చర్చలు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటివరకు డిసిసి అధ్యక్ష పీఠాన్ని అలంకరించిన మంత్రి మనిషి భవిష్యత్తు రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో భాగస్వామ్యం అయ్యే అవకాశాలు ఉన్నాయనే వార్త పట్ల భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత జిల్లా పార్టీ అధ్యక్షుడు ని నామినేటెడ్ పోస్ట్ వరిస్తే ఆ జిల్లాకు కొత్త బాస్ నియామకం అనివార్యమవుతుంది.

యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండండి!

- **ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు వచ్చే అవకాశం**
- **నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి: వ్యవసాయ అధికారి బాబురావు**

మణుగూరు, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):



రానున్న యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు. నీటి లభ్యత, విద్యుత్ సరఫరా సమస్యలను ముందుగానే అంచనా వేసుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు.

మణుగూరు మండలం చిన్న రాయిగూడెం గ్రామంలో బుధవారం ఎల్‌నినో ప్రభావంతో యాసంగి సీజన్‌లో ఎదురయ్యే పరిస్థితులపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, ఫలితంగా సాగునీటి లభ్యత తగ్గడంతో పాటు విద్యుత్ సరఫరాలోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని వివరించారు.

ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉండే వరి పంట సాగు చేపడితే భవిష్యత్తులో నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితులు తలెత్తవచ్చని హెచ్చరించారు. అందువల్ల రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసుకునే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ముందస్తు సాగు ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా పంట నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి నాటికి పుష్కరాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- **గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులకు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశం**
- **రూ.348.59 కోట్లతో ఘాట్లు, ఆలయ అభివృద్ధి.. భక్తులకు, వీఐపీలకు వేర్వేరు సౌకర్యాలు**

భద్రాచలం, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):



రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, వచ్చే శ్రీరామనవమి నాటికి పూర్తిచేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు.

బుధవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు, నూతన గోదావరి పుష్కర ఘాట్ నిర్మాణ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లు, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్టులు, కాంట్రాక్టర్లు, కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతి, పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి భద్రాచలానికి వచ్చే భక్తులతో పాటు గోదావరి పుష్కరాలకు హాజరయ్యే లక్షలాది మందికి సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన స్నాన ఘాట్లు కల్పించాలన్నారు.

భక్తుల సౌకర్యార్థం రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, డ్రైనేజీ, వైద్య సేవలు, భద్రత, రవాణా, అగ్నిమాపక ఏర్పాట్లను అన్ని శాఖలు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. పుష్కర వనం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని సేకరించాలని, వీఐపీలు, సాధారణ భక్తులకు వేర్వేరుగా పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని, భక్తుల బస కోసం డార్మెటరీలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి పనులు, పుష్కర ఘాట్ల నిర్మాణం తదితర పనుల కోసం మొత్తం రూ.348.59 కోట్ల నిధులు విడుదల చేసిందని తెలిపారు. కేటాయించిన నిధులతో చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. సమస్యల కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోకూడదని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు భద్రాచలాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేసే లక్ష్యంతో అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, డీపీవో అనూష, ట్రాన్స్‌కో ఎస్సీ మహేందర్, డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, డీఏవో భగవాన్ రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, భద్రాచలం సర్పంచ్ పూనేం కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే భూభారతి – కొత్వాల

- **పాల్వంచలో వారం రోజుల్లో భూ రీసర్వే ప్రారంభం**
- **999, 444, 817, 727 సర్వే నంబర్ల భూములకు పరిష్కారం చూపే దిశగా చర్యలు**

పాల్వంచ, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):





తెలంగాణ రాష్ట్రంలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.

భూభారతి - భూ రీసర్వేపై బుధవారం పాల్వంచ ఇంజనీర్స్ అసోసియేషన్ హాలులో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు భూ సర్వే చేపట్టి నిజమైన రైతులకు భూ హక్కు పత్రాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

ముఖ్యంగా పాల్వంచ పట్టణంలో ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న 999, 444, 817, 727 సర్వే నంబర్లకు సంబంధించిన భూములను రీ సర్వే చేయడం ద్వారా రైతులు, గృహ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు, గృహ యజమానులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

పాల్వంచలో మరో వారం రోజుల్లో రీ సర్వే ప్రారంభం కానుందని, ఈ అవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల కోరారు. భూ రికార్డుల పరిశీలన, హక్కుల నిర్ధారణ ప్రక్రియలో రైతులు, భూముల యజమానులు అధికారులకు సహకరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దారా ప్రసాద్, టౌన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్, కార్పొరేటర్లు కాల్వ భాస్కర్‌రావు, కొత్వాల విమలాదేవి, పైడిపల్లి జయలక్ష్మి, బానోత్ బాలూనాయక్, దంతెబోయిన నరేష్, శరపా శాంత, దున్నపోతుల మణి, గుర్రం వెంకటేశ్వర్లు, నామా కీర్తి, రైతులు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ పనితీరుపై ఎస్పీ రోహిత్ రాజు సమీక్ష

- **పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి**
- **బాధితులతో మర్యాదగా వ్యవహరించి మెరుగైన సేవలందించాలి**

భద్రాచలం, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):

భద్రాచలం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సందర్శించి స్టేషన్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, నాణ్యమైన దర్యాప్తు ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు.

పోలీసు సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, డయల్ 112 ద్వారా అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు.

vఅనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు.

స్వర్గీయ శీలం నర్సింహారావుకు ఎంపీ వద్దిరాజు ఘన నివాళి

- **మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి చిత్రపటానికి పూలమాలలు**
- **బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా**

నేలకొండపల్లి, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):

నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి భర్త, బీఆర్ఎస్ నాయకుడు స్వర్గీయ శీలం నర్సింహారావుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు.

గత నెల 30వ తేదీన మృతి చెందిన నర్సింహారావు దశదిన కర్మ (పెద్దకర్మ) కార్యక్రమం బుధవారం ఖమ్మంలోని శ్రీకర గార్డెన్స్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తదితర నాయకులు నర్సింహారావు చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

అనంతరం నర్సింహారావు సతీమణి, నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, కుమారులు ఉదయ్ కిరణ్, దుర్గాప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైనది..
అన్నదానం మహాదానం

- **పాల్వంచ అయ్యప్ప స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభం**
- **దీక్షా స్వాములకు అన్నప్రసాదం అందించడం పుణ్యకార్యం: కొత్వాల శ్రీనివాసరావు**

పాల్వంచ, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):

అయ్యప్ప స్వామి దీక్ష ఎంతో పవిత్రమైనదని, దీక్షా స్వాములకు అన్నప్రసాదం అందించడం మహా పుణ్యకార్యమని పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు, ట్రస్ట్ సభ్యుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప దీక్షల సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం కొత్వాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి మాధవన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గురుస్వాములను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు అన్నప్రసాదం అందించడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. దీక్షా స్వాములు నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ స్వామి వారి అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్నదానం చేయడం గొప్ప సేవాభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ సభ్యులు బండెల శ్రీనివాస్, మేడిద సంతోష్‌గౌడ్, గురుస్వాములు వెంపలి సత్యం (గుడివాడ), శంకరమణి, రాజలింగం, కేశబోయిన కోటేశ్వరరావు, బేతంశెట్టి వెంకట్, బి.ఎన్. చారి, మల్లెల నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.



భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలి

- **ఈవీఎం గోదాంను నెలవారీ తనిఖీ చేసిన :: జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

భద్రాద్రి న్యూస్ ములుగు

ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ నిర్వహించారు.
ఈ సందర్భంగా గోదాం సీల్‌ను పరిశీలించిన కలెక్టర్, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. గోదాం వద్ద పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా 24 గంటల పాటు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. భద్రతా విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయభాస్కర్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లాలో ముందస్తు వ్యవసాయ ప్రణాళిక!

- **వరి సాగు విస్తీర్ణం 89 వేల నుంచి 29 వేల ఎకరాలకు కుదింపు**
- **పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు పెంపునకు కార్యాచరణ: కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):

ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, అధిక నీటి అవసరమయ్యే వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల లభ్యత, సాగునీటి వనరుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అన్ని మండలాల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నాణ్యమైన విత్తనాల సరఫరా, నీటి పొదుపు, నేలలో తేమ సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

వరి సాగు తగ్గింపు.. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

రబీ 202526 సీజన్‌లో జిల్లాలో 2,00,529 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, రబీ 202627లో సుమారు 1,38,695 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. గత సీజన్‌తో పోలిస్తే సాగు విస్తీర్ణం సుమారు 31 శాతం తగ్గే అవకాశముందని పేర్కొన్నారు.
గత సీజన్‌లో 89,348 ఎకరాల్లో సాగైన వరిని ఈసారి 29,300 ఎకరాలకు పరిమితం చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. అదే సమయంలో పప్పుధాన్యాల సాగును 1,053 ఎకరాల నుంచి 9,300 ఎకరాలకు, నూనెగింజల సాగును 1,951 ఎకరాల నుంచి 3,509 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

60,957 బోరుబావులపై ప్రత్యేక సమీక్ష

జిల్లాలో మొత్తం 60,957 బోరుబావులు ఉండగా, వాటిలో 49,978 పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, 10,979 బోరుబావుల్లో పాక్షికంగా నీటి లభ్యత ఉందని కలెక్టర్ తెలిపారు. పూర్తిగా ఎండిపోయిన లేదా పనిచేయని బోరుబావులు లేవని నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.
పంటల్లో నేల తేమ తగ్గకుండా మల్చింగ్ పద్ధతిని అవలంబించాలని, బిందు సేద్యం వంటి సూక్ష్మ సాగునీటి విధానాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఆయిల్‌పామ్, యూకలిప్టస్ తోటల్లో వేరుశనగ, అరటి, మినుము వంటి అంతర పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. అయితే చెట్ల మధ్య దూరం, సూర్యరశ్మి, నేలలో తేమ, చెట్ల వయస్సును పరిశీలించి అనుకూలమైన ప్రాంతాల్లోనే అంతర పంటల సాగుకు సలహాలు ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.

రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన

అశ్వారావుపేట మండలంలో యూకలిప్టస్ తోటల్లో మినుము అంతర పంటగా సాగు చేస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. పంట ఎదుగుదల, నేలలో తేమ, చెట్ల మధ్య దూరం, పంటకు అందుతున్న వెలుతురు వంటి అంశాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు.
MANP 202627 పథకం కింద సబ్సిడీపై పప్పుధాన్యాల విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 'కేత్ బచావో అభియాన్' కార్యక్రమం ద్వారా అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ పంటల ఎంపిక, నేల తేమ సంరక్షణ, సాగునీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన



కల్పిస్తున్నట్లు వివరించారు.

క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ

వ్యవసాయ అధికారులు మండలాల వారీగా నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా పంటల పరిస్థితి, ఎదుగుదల దశ, నేలలో తేమ శాతం, చీడపీడల ఉనికిని పరిశీలించి నివేదికలు రూపొందించాలని సూచించారు. అవసరమైన చోట జియో ట్యాగింగ్ ఫొటోల ద్వారా పంటల పరిస్థితిని నమోదు చేయాలని తెలిపారు.
వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, నేలలో తేమ మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు సకాలంలో వ్యవసాయ సలహాలు అందించాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ముందుగానే అంచనా వేసి రైతులు నష్టపోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ సూచించారు.
రైతులందరూ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కోరారు.

నిజాయితీ, పారదర్శకతతోనే సంస్థల సమగ్ర అభివృద్ధి

- **సింగరేణి అధికారులకు విజిలెన్స్ అవగాహన కార్యక్రమం**
- **అవినీతి నిర్మూలనకు ప్రతి ఉద్యోగి నైతిక విలువలకు కట్టుబడాలి: కిషోర్ బగాడియా**

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):

నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన విధానాలే సంస్థల అభివృద్ధికి పునాదులని సాఫ్ట్ స్కిల్ ట్రైనర్, ఎన్ఎల్‌పీ ప్రాక్టీషనర్ కిషోర్ బగాడియా అన్నారు. ప్రతి ఉద్యోగి నైతిక విలువలకు కట్టుబడి విధులు నిర్వహించినప్పుడే అవినీతి రహిత వ్యవస్థ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాలులో 'నిజాయితీ ద్వారా సమృద్ధి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజిలెన్స్, హెచ్ఆర్‌డీ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, సత్తుపల్లి ఏరియాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కిషోర్ బగాడియా మాట్లాడుతూ సంస్థల్లో పారదర్శక సేవలు, నిజాయితీతో కూడిన విధానాలు అమలైతే అభివృద్ధి వేగవంతమవుతుంది



వివరించారు. నైతిక విలువలు, జవాబుదారీతనం, పారదర్శక పాలనను పాటించే సంస్థలు ప్రజల్లో విశ్వసనీయతను సంపాదించడంతో పాటు ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని పేర్కొన్నారు.
అవినీతి, లంచగొండితనం వ్యవస్థలను బలహీనపరచడమే కాకుండా సంస్థల అభివృద్ధికి ఆటంకంగా మారుతాయని వివరించారు.ప్రభుత్వ రంగ సంస్థల్లో చోటుచేసుకునే అవినీతి కార్యకలాపాలు, వాటి దుష్పరిణామాలు, అవినీతిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.
కాగా, సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల గనులు, విభాగాలు, సూపర్ బజార్లు, విద్యాసంస్థల్లో అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల కొనసాగింపుగా అధికారులకు ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో జీఎం (ఆర్అండ్‌డీ) సీహెచ్. శ్రీనివాస్, జీఎం (సీపీపీ), జీఎం (పీ అండ్ పీ) జి. దేవేందర్, జీఎం (హెచ్ఆర్‌డీ) ఆర్. విజయప్రసాద్, జీఎం (విజిలెన్స్) ఎస్.వి. మురళీధర రాజు, జీఎం (ఈఅండ్ఎం) సెంట్రల్ వర్క్‌షాప్ కె. రామ్మోహన్, కొత్తగూడెం రీజియన్ అధికారులు, విజిలెన్స్, హెచ్ఆర్‌డీ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంలో ఆదివాసీ మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు కీలక నిర్ణయం!

భద్రాచలం భద్రాద్రి న్యూస్

భద్రాచలంలోసర్పంచ్ పూనెం కృష్ణ అధ్యక్షతన బుధవారంఆదివాసీ సంఘాల నాయకులు, పెద్దల సమావేశం నిర్వహించడం జరిగింది.
ఈ సమావేశంలో ఆదివాసీ వీరుడు కోయ బెబ్బులి సోయం గంగులు విగ్రహాన్ని అంబేద్కర్ సెంటర్ వద్ద, ఆదివాసీ యోధుడు భగవాన్ బిర్సా ముండా విగ్రహాన్ని రెండవ వంతెన గోదావరి పాయింట్ వద్ద ప్రతిష్ఠించాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది.
ఆదివాసీ మహనీయుల త్యాగాలను, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.



ఈ సమావేశంలో ఆదివాసీ పెద్దలు, నాయకులు కుంజా ధర్మారావు, పూనెం వీరభద్రం, గుండు శరత్, తెల్లం రమణయ్య, పాయం రవివర్మ, కుంజా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేలో తప్పులకు తావుండకూడదు

- **నవంబర్ నెలాఖరులోగా తొలి విడత సర్వే పూర్తి చేయాలి**
- **అక్రమాలకు పాల్పడితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు: మంత్రి పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 11 (భద్రాద్రి న్యూస్):

రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో తప్పులు జరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. భూ వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడే అధికారులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఐడీఓసీ కార్యాలయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీసర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, లోపాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రీసర్వేకు రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని సూచించారు.

నవంబర్ నెలాఖరులోగా తొలి విడత పూర్తి

ప్రతి జిల్లాలో తొలి విడతగా ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లోనూ నవంబర్ నెలాఖరులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో రీసర్వే పూర్తి చేసేందుకు కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

రైతుల సమక్షంలోనే భూముల కొలతలు

రీసర్వే చేపట్టే గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించి, వారి సమక్షంలోనే భూముల కొలతలు నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ముందస్తు నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన అవగాహన కల్పించాలని తెలిపారు. సర్వే నివేదికలపై అభ్యంతరాలను ఎక్కడ, ఎలా సమర్పించాలి? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారనే వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే వివరాలను దండోరా ద్వారా ప్రజలకు తెలియజేసి, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించాలని, వచ్చిన అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

క్యూఆర్ కోడ్‌తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందించనున్న నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, రెవెన్యూ రికార్డులు కచ్చితంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా అసైన్డ్ భూముల పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం భూమిని అనుభవిస్తున్నారా లేదా నిర్ధారించాలని తెలిపారు.

పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉంటే నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను కూడా గుర్తించి పరిష్కరించాలని సూచించారు.

ప్రజల భూములకు సంబంధించిన వ్యవహారాల్లో ఏ అధికారి అయినా అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా రీసర్వేను నాణ్యతతో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడీ సర్వే శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ సవేరాం, ఇల్లందు తహశీల్దార్ ఖాసీం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





మారుమూల గిరిజన గ్రామాల్లో నేషనల్ సేవా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

- **మహిళలకు చీరలు, పురుషులకు దుప్పట్లు, చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ**

కొత్తగూడెం, నవంబర్ 11 (భద్రాద్రిన్యూస్):-



మారుమూల గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ నేషనల్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సంక్షేమ, విద్యా కార్యక్రమాలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో భాగంగా చంద్రుకుంట (మర్రిగూడెం) గ్రామంలో మహిళలకు చీరలు, పురుషులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కేవలం 30 కుటుంబాలు నివసించే ఈ మారుమూల గిరిజన ఆవాసంలోని ప్రజలకు ఫౌండేషన్ సభ్యులు సహాయాన్ని అందించారు. అదేవిధంగా పాల్వంచ మండలం కారేగట్టు గ్రామంలోని ప్రీ ప్రైమరీ పాఠశాల చిన్నారులకు పలకలు, బలపాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు ప్రాథమిక విద్యకు అవసరమైన సామగ్రిని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు చిన్ని బాబు అరిగెల మాట్లాడుతు కనీస వసతులు, అవకాశాలకు దూరంగా ఉన్న మారుమూల ప్రాంతాలకు చేరుకుని ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమ రంగాల్లో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కనూరు శ్రీనివాస్ సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రాంతంతో సంబంధం లేకుండా అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలన్న లక్ష్యంతో మారుమూల ప్రాంతాల్లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

కరాటే పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల విజయభేరి!

- **రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక.. జిల్లా స్థాయిలోనూ ప్రతిభ చాటిన విద్యార్థులు**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 9 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అండ్ సీబీఎస్ఈ జూనియర్ కళాశాల విద్యార్థులు కరాటే పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. తమ క్రీడా నైపుణ్యంతో పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు.

అండర్ 17 రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు పాఠశాలకు చెందిన ఎస్. యామిని (52 కేజీల విభాగం), పి. ఆస్మిత (68 కేజీల విభాగం) ఎంపికయ్యారు. అదేవిధంగా జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ఎస్. మనస్విని, కె. ప్రసన్న ద్వితీయ బహుమతులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థుల విజయాల పట్ల హర్షం వ్యక్తం చేసింది. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయపాలనతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొంది. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపింది.విద్యార్థుల విజయాల వెనుక నిరంతర సాధన, కఠోర శ్రమ, అంకిత భావంతో పాటు కోచ్‌ల మార్గదర్శకత్వం ఎంతో ఉందని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు మరింత ఉత్సాహంతో సాధన చేసి రాష్ట్రస్థాయిలోనూ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె. రవీందర్ రెడ్డి, డైరెక్టర్ పి. వినీతా రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు



పల్లెల సమగ్ర ప్రగతికే తొలి ప్రాధాన్యం

- **స్వంత జిపి భావనాలతోనే సులభతర పాలన**
- **మహిళా సాధికారతకు వీవో కేంద్రాలు ఊతం**
- **తెలంగాణ పబ్లిక్ స్కూల్ సాధన విద్యారంగంలో నూతన అధ్యాయం**
- **సింగభూపాలెం చెరువు అభివృద్ధితో సాగుకు కొత్త భరోసా**
- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
- **రూ.50లక్షలతో నిర్మించిన జీపీ, వివో భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే**

సుజాతనగర్ ,నవంబర్ 11 (భద్రాద్రిన్యూస్):-

పల్లెల సమగ్ర ప్రగతి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బేతంపూడి, మాలబంజర, 2 ఇంక్లైన్ గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన అభివృద్ధి భవనాలను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. బేతంపూడి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో, మాలబంజరలో మరో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాలను, 2 ఇంక్లైన్ పంచాయతీ పరిధిలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య (వీవో) భవనాన్ని ఆయన ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సమావేశాల్లో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. స్థానిక సంస్థలకు సొంత భవనాలు సమకూరినప్పుడే గ్రామీణ పరిపాలన సమర్థవంతంగా సాగుతుందని, ప్రజలకు సేవలు వేగంగా అందుతాయని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక వికాసానికి వీవో భవనాలు వేదికలుగా నిలవాలన్నారు. మండలానికి జూనియర్ కళాశాల ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అని, తెలంగాణ పబ్లిక్ స్కూల్'ను సాధించి వారి ఆశలు నెరవేర్చడం ద్వారా నూతన అధ్యాయానికి నంది పలికామని అదేవిధంగా సింగభూపాలెం చెరువు అభివృద్ధిపై దృష్టి సారించి నిధుల వరద కురిపించడం ద్వారా సాగుకు భరోసా కల్పించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడిఓ భారతి, పిఆర్ డీఈ నాగేందర్, ఏఈ నవీన్ కుమార్, విద్యుత్ ఏఈ కిషన్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, మండే హన్మంతరావు, స్థానిక నాయకులు గుగులోత్ బాలు, కొమ్య, నాగేంద్రబాబు, భాగం కృష్ణ, హత్తిరం, ఆకుల వెంకన్న, సారయ్య, కృష్ణ, భూక్యా రవి తదితరులు పాల్గొన్నారు.





ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

- **జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ -11 (భద్రాద్రిన్యూస్):-

ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ఈ నెల 13 (శుక్రవారం) నాడు ఖమ్మంలోని టిటిడిసి(హవేలీ రెస్టైంట్ ఎదురుగా) లో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించబడుతున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి యన్.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ జాబ్ మేళా ద్వారా ప్రముఖ ప్రైవేట్ కంపెనీలలో పలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు అన్నారు. అపోలో ఫార్మసీ (హైదరాబాద్) లో ఖమ్మం లొకేషన్ కొరకు D/B/Mఫార్మసీ పూర్తి చేసిన 18 నుండి 30 సంవత్సరాల వయసు గల అభ్యర్థులకు 10 ఫార్మసిస్ట్ పోస్టులు (నెలకు రూ. 12,500 నుండి 25,000/ వేతనం), అలాగే హైదరాబాద్ లొకేషన్ కొరకు 10th, ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన వారికి 15 ఫార్మసిస్ట్ అసిస్టెంట్ పోస్టులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అదేవిధంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నందు మేనేజర్, చీఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్, లైఫ్ పోర్ట్‌ఫోలియో మేనేజర్ విభాగాల్లో మొత్తం 40 ఖాళీలను భర్తీ చేయనున్నారని తెలిపారు. ఈ పోస్టులకు ఇంటర్, ఏదైనా డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, 25 నుండి 65 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని, ఎంపికైన వారికి ఏడాదికి రూ. 1.5 లక్షల నుండి 3.6 లక్షల వరకు వేతనంతో పాటు ఇన్సెంటివ్‌లు ఉంటాయని అన్నారు.

అర్హత, ఆసక్తి గల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఈ నెల 13 (శుక్రవారం) నాడు ఉదయాన్నే నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాల్సిందిగా అన్నారు. ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు 7207917714, 7036862017 ఫోన్ నంబర్లలో సంప్రదించగలరని జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రయాథ్లాన్‌లో ప్రతిభ చాటిన నిఖిల్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

భద్రాద్రి న్యూస్ ములుగు

గోవాలో నిర్వహించిన ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ పోటీల్లో ప్రతిభ చాటిన ములుగు జిల్లా యువకుడు వజ్జా నిఖిల్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అభినందించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నిఖిల్ జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన నిఖిల్ గోవాలో ఇటీవల నిర్వహించిన ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ పోటీల్లో 1.9 కిలోమీటర్ల ఈత, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21.1 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి సత్తా చాటారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. నిఖిల్ సాధించిన విజయం జిల్లాలోని యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ములుగు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



తల్లి భారత లక్ష్మీ నేత్రాలను దానం చేసిన కుమారులు.

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 11, (భద్రాద్రిన్యూస్):-



స్థానిక ముస్తఫా నగర్ లో అనారోగ్యంతో మరణించిన తమ మాతృమూర్తి భారత లక్ష్మి నేత్రాలను కుమారులు ఖమ్మం నేత్ర నిధికి బుధవారం నేత్రదానం చేశారు. తమ మాతృ మూర్తి నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించవచ్చనే సదుద్దేశంతో కుమారులు తీర్దాల శ్రీనివాసరావు, తీర్దాల ప్రభాకర్, తీర్థాల శివాజీ నిర్ణయం తీసుకొని తల్లి నేత్రాలను దానం చేశారు. ఇదే విధంగా వివిధ కారణాలవల్ల మరణించిన వారి నేత్రాలను దానం చేసి ఎందరికో కంటి చూపు ప్రసాదించి వెలుగులు నింపాలని జర్నలిస్టు తీర్దాల శివాజీ తెలియజేశారు.

భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలి

- **నవంబర్ 30లోగా తొలి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలి**
- **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

భద్రాద్రి న్యూస్ ములుగు





భూముల రీసర్వే ప్రక్రియను రైతులకు ప్రయోజనం కలిగేలా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

బుధవారం హైదరాబాద్ నుంచి సీసీఎల్ఏ లోకేష్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎండీ వి.పి. గౌతమ్‌లతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, రెవెన్యూ శాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీసర్వే ప్రక్రియ, భూ సమస్యల పరిష్కారం, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, పెండింగ్ దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను నవంబర్ 30వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే పనులను అధికారులు అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

రీసర్వేలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తొందరపాటుతో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీసర్వే నిర్వహించే గ్రామాల్లో సంబంధిత రైతులకు ఒకరోజు ముందుగానే జెండాలు అందజేయాలని సూచించారు. రైతులు తమ భూముల సరిహద్దులను జెండాలతో గుర్తించిన అనంతరం సర్వేయర్లు వాటి ఆధారంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దులను గుర్తించి, సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో భూ వివాదాలు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా అటవీ శాఖతో ముడిపడి ఉన్న సమస్యలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, తహశీల్దార్లు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రీసర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

రీసర్వే ప్రక్రియను ప్రాధాన్య కార్యక్రమంగా పరిగణించి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా ములుగు జిల్లాలో భూముల రీసర్వే పురోగతిని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంత్రికి వివరించారు.

జిల్లాలో మొత్తం 73 గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 26 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని, మరో 10 గ్రామాల్లో పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో త్వరితగతిన సర్వే పనులు ప్రారంభించి, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి, ఆర్డీవో కె. కృష్ణవేణి, ఏవో అల్లం రాజ్‌కుమార్, తహశీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కళల వారసత్వాన్ని కొనసాగిద్దాం.

- **---పిల్లల సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రోత్సహించాలి.**
- **--సెల్ ఫోన్ బానిసత్వానికి దూరంగా ఉండాలి.**
- **--జిల్లా అడిషనల్ సిపి రామానుజం.**
- **--హోరెత్తిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాలు.**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 11 (భద్రాద్రిన్యూస్):-



మనదేశ కళల వారసత్వాన్ని ప్రతి తరం వారు కొనసాగించాలని రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాల ప్రారంభ సభలో జిల్లా అడిషనల్ పోలీస్ కమిషనర్ రామానుజం తెలియజేశారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం వారధి ఫౌండేషన్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ వేడుకల ప్రారంభోత్సవానికి అడిషనల్ సిపి రామానుజం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన దేశానికి చెందిన కళారూపాలు ప్రపంచవ్యాప్తంగా అందరినీ ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. మన సాంప్రదాయ జానపద కళారూపాలకు రోజురోజుకూ సినిమాల్లోనూ అత్యధిక ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు.

పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేలా తల్లిదండ్రులు నిత్యం ప్రోత్సహించాలని కోరారు. పిల్లలు సెల్ఫోన్ బానిసత్వానికి గురికాకుండా సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సృజనాత్మకతను పెంపొందించే కళలను నేర్చుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా ,దృఢంగా రూపొందుతారని, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఖమ్మం బాలోత్సవ్ సంబురాల సభలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొనడమే పిల్లలకు గొప్ప విజయం అని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సంబురాలలో పాల్గొనేలా ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ జంగాల సునీల్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, డాక్టర్ కాటమనేని రాజకుమార్, నృత్యదర్శకులు ఆర్ ఎన్ ప్రసాద్, న్యాయ నిర్ణేతలు లింగం శ్రీనివాసరావు, జైపాల్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ బాధ్యులు చిక్కుళ్ల వెంకటేష్, పగిల్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్ ,రాజేష్ ,భవాని శంకర్, ముకేశ్, నాని,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

--హోరెత్తిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ నృత్యాలు.

వారధి ఫౌండేషన్ ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు హోరెత్తాయి. బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, పలు జిల్లాల నుంచి బాలలు 300 మందికి పైగా పోటీలలో పాల్గొన్నారు. తొలి రోజు సాంప్రదాయ విభాగాలలో జూనియర్, సీనియర్ విభాగాలలో బాల బాలికలు తమ సృజనాత్మకతకు దర్పణం పట్టారు. నెమళ్ళు నాట్యం ఆడినట్లుగా సాంప్రదాయ వస్త్రధారణలో సంగీతానికి అనుగుణంగా స్టెప్పు లేస్తూ బాలల ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఉర్రూతలుగించాయి. అతిపెద్ద డిజిటల్ స్క్రీన్ పై , డిజిటల్ లైట్ల వెలుగులతో బాల బాలికలు ప్రదర్శించిన నృత్యాలను తల్లిదండ్రులు తిలకించి మురిసిపోయారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలన్ని సభికులని కనువిందు చేశాయి. సోలో క్లాసికల్ , ఫోక్ డాన్స్ విభాగాలకు 200 ఎంట్రీస్, గ్రూప్ క్లాసికల్, ఫోక్ డాన్స్ కు గాను 40ఎంట్రీస్, ఫ్యాన్సీ డ్రెస్ విభాగానికి 50ఎంట్రీల ద్వారా బాల బాలికలు తమ సృజనతో కనువిందు చేస్తున్నారు. ఖమ్మం బాలోత్సవ్ పోటీలు గురువారం సాయంత్రం వరకు జరుగుతాయని, అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో అతిధులు బహుమతి ప్రధానం చేస్తారని వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ నిర్వాకులు తెలియజేశారు. ఖమ్మంలో తొలిసారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ కు బాల బాలికల నుంచి అనూహ్య స్పందన రావడంతో నిర్వాహకుల్లో ఆనందోత్సవాలు వెల్లువిరుస్తున్నాయి.





